క్లుప్తంగా

గుంతల పూడ్చివేత



గుంతలను పూడ్చివేస్తున్న జీపీ సిబ్బంది

నాగారం : సూర్యాపేట –జనగామ జాతీయ రహదారిపై పేరబోయినగూడెం వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న గుంతలను మంగళవారం గ్రామ పంచాయతీ సిబ్బంది పూడ్చివేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యదర్శి శోభన్ మాట్లాడారు. జాతీయ రహదారిపై గుంతలు ఏర్పడి ప్రమాదకరంగా మారాయన్నారు. ఈ గుంతలతో రాత్రివేళల్లో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో మట్టితో పూడ్చివేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాద మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



కాసర్లపహాడ్‌లో మృతుడి కుటుంబీకులకు రూ.50వేల చెక్కు అందజేస్తున్న నరేష్

అర్వపల్లి : మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వేముల లక్ష్మణ్ కుటుంబానికి గ్రామానికి చెందిన దబ్బేటి నరేష్‌తోపాటు వారి మిత్ర బృందం ఆధ్వర్యంలో మంగళవారం రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. మృతుడి కుమారుడి ఇంటర్ చదువులకు తాను కళాశాల ఫీజు చెల్లిస్తానని హైదరాబాద్‌లోని సానరీ లేబరేటరీస్ అధినేత తిలక్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో దబ్బేటి నవ్య, మంచాల గణేష్, ఉప్పుల విక్రం, కంపసాటి నరేష్ పాల్గొన్నారు.

రూ.5వేల సాయం..

మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన డ్రైవర్ వేముల లక్ష్మణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. దీంతో గ్రామ శ్రీకృష్ణయాదవ్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం మృతుడి కుటుంబీకులకు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూత్‌క్లబ్ అధ్యక్షుడు జానపాటి గోవర్దన్, శ్రవణ్, లక్ష్మణ్, లింగరాజు, నాగరాజు, దయాకర్, గణేష్, మురళి, నరేష్, యాదగిరి, వెంకన్న, విజయ్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

సూర్యాపేట : పీడీఎస్ బియ్యం అక్రమ వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఓయూ జేఏసీ చైర్మన్ జటంగి సురేష్ యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం రాష్ట్ర డీజీపీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో 2014 నుంచి ఈ అక్రమ బియ్యం రవాణా యథేచ్ఛగా కొనసాగిందని విమర్శించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా సరఫరాకు సహకరించిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు.

గోదావరి జలాలను విడుదల చేయాలి



మాట్లాడుతున్న కొలిశెట్టి యాదగిరిరావు

నూతనకల్ : గోదావరి జలాలను విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని తొట్ల మల్సూర్ స్మారక భవనంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. యాసంగి వరి సాగు కోసం రైతులకు గోదావరి జలాలను విడుదల చేయడం తోపాటు విత్తనాలు, ఎరువులను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ కాని రైతులకు రుణమాఫీ చేయాలని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి కందాల శంకర్‌రెడ్డి, తొట్ల అచ్చయ్య, బత్తుల తిరుమలేష్, సైదులు, శ్రీను, శ్రీనివాస్‌రెడ్డి, జానయ్య పాల్గొన్నారు.

అర్హులను ఎంపిక చేసేందుకు..

- గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే
- ప్రత్యేక యాప్‌లో వివరాల నమోదు
- ఈనెలాఖరు తుది గడువు

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. పేదలకు ఇళ్లు మంజూరు చేయాలనే లక్ష్యంతో పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం సర్వే చేపట్టింది. పెన్‌పహాడ్ మండలంలోని 14 గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో ఇళ్ల కోసం మొత్తం 8,797 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే లబ్ధిదారుల ఎంపిక కోసం ప్రభుత్వం ఓ ప్రత్యేక యాప్‌ను రూపొందించింది. అధికారులు యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ఈ సర్వేను ఈ నెల 31 వరకు పూర్తి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయా గ్రామ పంచాయతీల వారీగా గ్రామ కార్యదర్శులు స్థానిక ఇందిరమ్మ ఇళ్ల కమిటీలతో కలిసి లబ్ధిదారుల వివరాలను ప్రత్యేక యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఇప్పటివరకు మండలంలోని 14 పంచాయతీల్లో సుమారు 845 మంది వివరాలను నమోదు చేశారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారికి మాత్రమే సర్వే చేస్తున్నారు. లబ్ధిదారుల వివరాలు ఉంటేనే వారి మొబైల్ నంబర్ ఆధారంగా వివరాలు సేకరించి యాప్‌లో నమోదు చేస్తున్నారు. కొత్త వారికి మాత్రం అవకాశం లేదు.



నాగారంలో ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

వివరాల నమోదుకు మొబైల్ యాప్..

ఇందిరమ్మ ఇళ్ల యాప్‌లో లాగిన్ అయ్యేందుకు ప్రభుత్వం గ్రామాల కార్యదర్శులకు యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ అందించింది. కార్యదర్శులు తమ మొబైల్ ఫోన్‌లో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ ద్వారా లాగిన్ అవ్వాలి. యాప్ ఓపెన్ చేయగానే వారికి కేటాయించిన లబ్ధిదారుల వివరాలు అందులో ఉంటాయి. అందులోని మొబైల్ నంబర్‌కు ఫోన్ చేసి వారున్న ఇంటికి వెళ్లి అధికారులు వివరాలను సేకరిస్తున్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటి స్థలం ఉందా, లేదా అన్న అంశం ఆరా తీస్తున్నారు. వారు నివాసముంటున్న ఇళ్లు అద్దెదా, సొంతమా అని విచారిస్తున్నారు. స్థలం ఉంటే ఎక్కడుంది అన్న వివరాలు తెలుసుకుని నమోదు చేస్తున్నారు.

గడువులోగా పూర్తి చేయిస్తాం



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గడువులోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. సర్వేలో ప్రతీ దరఖాస్తుదాడి ఇంటికి వెళ్లి యాప్‌లో వివరాలు నమోదు చేసి, ఫొటో తీసి అప్‌లోడ్ చేసేలా కార్యదర్శులకు అవగాహన కల్పించాం. సర్వే పారదర్శకంగా కొనసాగుతోంది.

– కె.మారయ్య, ఎంపీడీఓ

కొనసాగుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్ష



కలెక్టరేట్ ఎదుట దీక్షలో పాల్గొన్న సమగ్ర శిక్షా ఉద్యోగులు

భానుపురి (సూర్యాపేట) : తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ సమగ్ర శిక్షా ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన నిరాహార దీక్షలు మంగళవారం 8వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం నాయకులు మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని దీక్షలు చేపట్టడంతో ఎంఈఓ, డీఈఓ కార్యాలయాలు మూతపడ్డాయని, విద్యాశాఖ అడ్మినిస్ట్రేషన్ పూర్తిగా స్తంభించిపోయిందన్నారు. 2023 సెప్టెంబర్ మాసంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలన్నారు. పేస్కేల్ అమలు చేయడంతోపాటు రీ ఎంగేజ్ విధానం తొలగించి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దీక్షలకు ఐద్వా జిల్లా కార్యదర్శి మద్దెల జ్యోతి, జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మార్జున్, అనిల్‌కుమార్, శ్రీనివాసరావు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి గద్దం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్, లక్ష్మీనారాయణ, రాంబాబు, పెండెం శ్రీనివాస్, శ్రీధర్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీళ్లు రాక విద్యార్థుల అవస్థ

అర్వపల్లి : మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రాక అర్వపల్లిలోని జెడ్పీహెచ్‌ఎస్ విద్యార్థులు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఈ పాఠశాలకు మిషన్ భగీరథ నీళ్లే ఆధారం. అయితే ఇటీవల తరచుగా నీటి సరఫరా నిలిచిపోతుండటంతో మధ్యాహ్న భోజన సమయంలో పిల్లలు ఇక్కట్ల పాలవుతున్నారు. తాజాగా మంగళవారం కూడా మిషన్ భగీరథ నీళ్లు నిలిచిపోవడంతో మధ్యాహ్న భోజన వంటలకు, పిల్లలు తాగడానికి నీళ్లు లేక ఇబ్బందులు పడ్డారు. పాఠశాలలో 350 మంది వరకు పిల్లలు విద్యనభ్యసిస్తున్నారు. వీరంతా నీళ్లు లేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మిషన్ భగీరథ నీళ్లు సరిగా రాని విషయాన్ని సంబంధిత అధికారుల దృష్టికి ఎప్పటికప్పుడు తీసుకెళ్తున్నట్లు హెచ్‌ఎం ఎం. విజయలక్ష్మి తెలిపారు. నిత్యం మిషన్ భగీరథ నీళ్లు వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



అనాజిపురం ఆదర్శ పాఠశాల ఎదుట నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

పెన్‌పహాడ్ : గత దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని అనాజీపురం ఆదర్శ పాఠశాలలో ఉపాధ్యాయులు మంగళవారం భోజన సమయంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పీఎంటీఏ టీఎస్ అధ్యక్షుడు గుండగాని రాజయ్యగౌడ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు గుర్రాల సోమయ్య మాట్లాడారు. మోడల్ స్కూల్‌లను విద్యాశాఖలో విలీనం చేసి 010 పద్దు కింద వేతనాలను చెల్లించాలన్నారు. చనిపోయిన ఉపాధ్యాయ కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలని, ప్రమోషన్లు చేపట్టాలని కోరారు. సానుకూల పరిష్కారం లభించే వరకు పీఎంటీఏ టీఎస్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిరసనలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోడి లింగయ్య, గురుచరణ్, వీరారెడ్డి, సంపత్‌కుమార్, జయంతి, శైలజ, లింగయ్య, లక్ష్మీనారాయణ, చేనువాసు, సూర్యంగౌడ్, లింగయ్య, కిరణ్‌దేశ్‌పాండే, కొనూర్ అంజు, సైదులు, ప్రమోద, రమాదేవి, ఖాదర్‌ఉన్నిసా తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు చేయడం సమంజసం కాదు



అర్వపల్లి పోలీస్ స్టేషన్‌లో అరెస్టయిన గ్రామపంచాయతీ కార్మికులు

పెన్‌పహాడ్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గ్రామ పంచాయతీ వర్కర్లు జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాకు తరలివెళ్లకుండా అక్రమంగా అరెస్టు చేయడం సమంజసం కాదని గ్రామపంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పెన్‌పహాడ్ మండలంలోని గ్రామ పంచాయతీ వర్కర్లను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ వర్కర్లు మట్టయ్య, శ్రవణ్, శ్రీనివాస్, నరేష్ పాల్గొన్నారు.

నూతనకల్ : పోలీసులు అక్రమంగా పీవైఎల్ నాయకులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు అన్నారు. గ్రామపంచాయతీ వర్కర్ల సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించ తలపెట్టిన ధర్నా కార్యక్రమానికి వెళ్లకుండా ఐఎఫ్‌టీయూ, పీవైఎల్ నాయకులను పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలిపే హక్కు కూడా లేకుండాపోయిందని ఆయన తెలిపారు.

అర్వపల్లి : పెండింగ్ బిల్లులను చెల్లించాలని కోరుతూ చలో హైదరాబాద్ తలపెట్టిన నేపథ్యంలో మండలంలోని వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లను మంగళవారం స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మాజీ సర్పంచ్‌లు బైరబోయిన సునీతరామలింగయ్య, పీరమ్మ, కరుణాకర్, దానం సుజాతయాదగిరి ఉన్నారు.

అర్వపల్లి : చలో హైదరాబాద్‌కు పిలుపునివ్వడంతో మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులను మంగళవారం పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ తర్వాత సాయంత్రం విడుదల చేశారు. అరెస్టయిన వారిలో గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు ఊట్కూరి భీముడు, ఉపాధ్యక్షుడు కుంభం రామ్మూర్తి, బోయపల్లి వీరయ్య, రాష్ట్ర కార్యదర్శి ఖమ్మంపాటి రవీందర్, శ్రీరాములు, అంకిరెడ్డి లింగయ్య, దేవరకొండ నర్సయ్య, సైదులు, లక్ష్మయ్య, రేణుక, రమేష్, రాములు తదితరులు ఉన్నారు.

మద్దిరాల : హైదరాబాద్‌లో తలపెట్టిన ధర్నాకు వెళ్లకుండా మంగళవారం పోలీసులు ముందస్తుగా పారిశుద్ధ్య కార్మికులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అంబేద్కర్ విగ్రహాలకు బీఆర్‌ఎస్ నాయకుల వినతి



సూర్యాపేట టౌన్ : అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



తిరుమలగిరిలో..



మద్దిరాలలో..



తుంగతుర్తి : గానుగుబండలో..



నూతనకల్‌లో..

సూర్యాపేటటౌన్ : డాక్టర్ బీఆర్.అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి జ్ఞానోదయం కలిగించాలంటూ జిల్లా కేంద్రంలో బీఆర్‌ఎస్ శ్రేణులు మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, గ్రంథాలయ మాజీ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్‌గౌడ్‌లు మాట్లాడుతూ లగచర్ల గిరిజన రైతులపై ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించిందని విమర్శించారు. ప్రశ్నించినవారిపై కేసులు నమోదు చేసి రైతులకు బెయిల్ రాకుండా అడ్డుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జీడి భిక్షం, సత్యనారాయణ, తూడి నర్సింహారావు, ముదిరెడ్డి అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

తిరుమలగిరి : కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసిన లగచర్ల గిరిజన రైతులను వెంటనే విడుదల చేసి, వారిపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం స్థానిక తెలంగాణ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలనే గిరిజన రైతులపై అక్రమ కేసులు బనాయించి జైలులో పెట్టిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్మినేని సతీష్‌కుమార్, దూపటి రవీందర్, యాకూబ్‌నాయక్, కందుకూరి బాబు, బర్ల వెంకన్న, ఎం.అంజయ్య, వీరయ్య, నాగరాజు, మధు, నాని, సుమన్, శ్రీను, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.

నూతనకల్ : లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి మంగళవారం వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు మున్నా మల్లయ్య యాదవ్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు బత్తుల విద్యాసాగర్, మూరగుండ్ల సైదులు, పులుసు లింగమల్లయ్య, ఉప్పుల వీరుయాదవ్, మొగుళ్ల వెంకన్న, కర్ణాకర్ రెడ్డి, బయ్యా అశోక్, పిట్టల స్వామి పాల్గొన్నారు.

లగచర్ల రైతుల అక్రమ అరెస్టులు అమానుషం

మద్దిరాల : లగచర్ల రైతుల అక్రమ అరెస్టులు అమానుషమని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఎస్‌ఏ.రజాక్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామశాఖ అధ్యక్షుడు వడ్డాణం మధుసూదన్, సురారపు రాజు, భూసాని ఉమామహేశ్వర్, శ్రవణ్‌కుమార్, బొబ్బిలి ఉప్పలయ్య, బీఎస్ ముదిరాజ్, మల్యాల నర్సయ్య, సోమనర్సయ్య, మహేందర్‌రెడ్డి, తిరుమల్‌రావు, అమృతరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి : కాంగ్రెస్ ప్రభుత్వం లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తాటికొండ సీతయ్య అన్నారు. మంగళవారం గానుగుబండ గ్రామంలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని రాములుగౌడ్, గుండగాని దుర్గయ్య, కంచెర్ల కుశలవరెడ్డి, పోలేపాక పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాలకు వేలం

సూర్యాపేటటౌన్ : వివిధ కేసుల్లో పట్టుబడి, సీజ్ చేసిన 8 వాహనాలకు బుధవారం సూర్యాపేట ఎక్సైజ్ స్టేషన్‌లో ఎక్సైజ్ అధికారి లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య మంగళవారం ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలం పాటలో పాల్గొనాలనుకునేవారు ఉదయం 9 గంటలకు స్టేషన్‌లో ముందుగా ధరావతు చెల్లించాలని పేర్కొన్నారు. టీవీఎస్ ఎక్సెల్ 4, హీరో హోండా స్ప్లెండర్ 2, హీరో హెచ్‌ఎఫ్ డీలక్స్ 1, హీరో గ్లామర్ 1 వాహనాలకు వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే



కాసర్లపహాడ్‌లో సర్వే చేస్తున్న అధికారులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే కొనసాగుతోంది. ప్రజాపాలనలో మండల వ్యాప్తంగా 8,450 దరఖాస్తులు రాగా 17 మంది ఎన్యుమరేటర్లు ఇంటింటికీ వెళ్లి దరఖాస్తుదారుల వివరాలను సేకరిస్తున్నట్లు ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి, ఎంపీఓ గోపి తెలిపారు. వివరాలను వెంటనే ఇందిరమ్మ యాప్‌లో నమోదు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల తుది జాబితా ప్రదర్శన



అర్వపల్లిలో తుది జాబితాను నోటీసు బోర్డుపై ఏర్పాటు చేస్తున్న ఎంపీఓ, సిబ్బంది



నూతనకల్ : తుది జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీఓ సునీత, తదితరులు

అర్వపల్లి : స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల తుది జాబితాను మంగళవారం మండలంలోని 17 గ్రామపంచాయతీలలో అధికారులు విడుదల చేశారు. పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ఆయా గ్రామపంచాయతీ కార్యాలయాలలోని నోటీస్ బోర్డుపై ఉంచారు. మండల వ్యాప్తంగా ఈ ఎన్నికలకు 152 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీఓ టి. గోపి తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది లింగయ్య, సంతోష, నవీన్, రామ్మూరి పాల్గొన్నారు.

నూతనకల్ : నూతనకల్ మండల పరిధిలోని 17 గ్రామ పంచాయతీల పరిధిలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల తుది జాబితాను ప్రదర్శించినట్లు ఎంపీడీఓ సునీత తెలిపా రు. మండల పరిషత్ కార్యాలయంలో 166 పోలింగ్ కేంద్రాల జాబితాను ప్రదర్శించామని తెలియజేశారు.

మృతుడికి పలువురి నివాళి

అర్వపల్లి : తిమ్మాపురం గ్రామానికి చెందిన బొడ్డుపల్లి చంద్రయ్య మంగళవారం మృతి చెందారు. దీంతో అతడి మృతదేహానికి బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు మారిపెద్ది శ్రీనివాస్‌గౌడ్, సూర్యాపేట జెడ్పీటీసీ జీడి భిక్షం వేర్వేరుగా నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో గ్రామశాఖ అధ్యక్షుడు దశరథరామారావు, పాలసంఘం మాజీ చైర్మన్ చల్లా వేణుధర్‌రెడ్డి, దేశిడి సందీప్‌రెడ్డి, కొండల్ ఉన్నారు.

కబడ్డీ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

మునగాల : కబడ్డీ అసోసియేషన్ మండల కమిటీని మంగళవారం మునగాల మండల కేంద్రంలోని రైతు వేదికలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూలోకరావు, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కర్తయ్య సమక్షంలో ఈ ఎన్నిక జరిగింది. అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా అంబటి లింగారెడ్డి, ఉపాధ్యక్షులుగా టి.నరేష్, బి.సుందరయ్య, కార్యదర్శిగా ఎం.సైదులు, జాయింట్ సెక్రటరీలుగా జి.లక్ష్మయ్య, షేక్ నబీసాహెబ్, కోశాధికారిగా సాల రవి, కార్యవర్గ సభ్యులుగా బి.అంజి, ఎం.శ్రీనివాసరావు, చెరుకు బాబు ఎన్నికయ్యారు.

మాదిగల మహాగర్జనను జయప్రదం చేయాలి

చిలుకూరు : హైదరాబాద్‌లో వచ్చే నెల 19వ తేదీన జరిగే మాదిగల మహాగర్జనలో మాదిగలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చింతా బాబు మాదిగ కోరారు. ఈమేరకు మంగళవారం మండలంలోని చిలుకూరు, సీతారాంపురం, నారాయణపురం గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగలు అణిచివేతకు గురవుతున్నారని, ఇప్పటికైనా ఐక్యంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బాణాల అబ్రహం, మండల అధ్యక్షుడు బొల్లెపంగు కాశి, నాయకులు కందుకూరి నాగేశ్వరరావు, స్వామి, కొత్తపల్లి శ్రీనివాస్, చింతా శ్రీను, వెంకటేశ్వర్లు, ముదిగొండ అంజి, నరసింహారావు, సీతారాములు, ఏసోబు, లాలు, తిరపయ్య పాల్గొన్నారు.

రూ.1200 కోట్లతో అభివృద్ధి పనులు



సమావేశంలో మాట్లాడుతున్న నరేష్

తిరుమలగిరి : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఒక సంవత్సర కాలంలోనే తుంగతుర్తి నియోజకవర్గంలో రూ.1200 కోట్లతో అనేక అభివృద్ధి పనులు జరిగాయని కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు వై.నరేష్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే సామేల్ అహర్నిషలు కృషి చేస్తున్నారని అన్నారు. తుంగతుర్తి మండలంలో 100 ఎకరాలలో పారిశ్రామిక కారిడార్ ఏర్పాటు, తిరుమలగిరి, మోత్కూరు మండలాల్లో 30 పడకల ఆస్పత్రికి ప్రతిపాదనలు పంపారని తెలిపారు. తిరుమలగిరి మండలంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. త్వరలోనే రుద్రమ దేవి చెరువును రిజర్వాయర్‌గా మార్చడానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో అక్రమంగా ఇసుకను తరలించారని ఆరోపించారు. ప్రస్తుతం నియోజకవర్గంలో శాంతియుత వాతావరణం నెలకొన్నదని తెలిపారు. సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ధరావత్ జమ్మిలాల్, సుంకరి జనార్దన్, కందుకూరి లక్ష్మయ్య, బత్తుల శ్రీను, గిలకత్తుల రాము గౌడ్, వంగాల డానియల్, కె.మల్లయ్య, సుధాకర్, రామోజీ, వంశీ, కిష్టునాయక్, రాములు నాయక్, రఫీజ్ ఖాన్ సోమయ్య పాల్గొన్నారు.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

అర్వపల్లి : సన్న ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని ఐకేపీ ఏపీఎం వలిశెట్టి మల్లేష్ అన్నారు. అర్వపల్లిలోని సన్నధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వం సన్నధాన్యం క్వింటాకు రూ.500 చొప్పున బోనస్‌ను రైతుల ఖాతాల్లో జమ చేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ శోభారాణి, కేంద్రం ఇన్‌చార్జ్ లింగంపల్లి ఈశ్వరి, నిర్వాహకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి



తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు సామగ్రి అందజేస్తున్న కృష్ణకుమార్



మద్దిరాలలో పుస్తకాలను అందజేస్తున్న దాత

అర్వపల్లి : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకరించాలని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత, పర్యావరణ వేత్త డాక్టర్ పెండెం కృష్ణకుమార్ కోరారు. తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌కు మంగళవారం స్వచ్ఛందంగా దేశనాయకులు, శాస్త్రవేత్తల చిత్రపటాలు, మెడికల్ కిట్లు, వాటర్‌క్యాన్, వివిధ రకాల మ్యాప్‌లు, ఆట వస్తువులు, క్లాత్ బ్యాగులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్ బ్యాగుల వాడకాన్ని నిషేధించి క్లాత్ బ్యాగులను ఉపయోగించాలని సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు కుంభం ప్రభాకర్ పాల్గొన్నారు.

మద్దిరాల : మద్దిరాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1990-1991 బ్యాచ్ పూర్వ విద్యార్థి గద్దె సత్యనారాయణ తాను చదువుకున్న పాఠశాలపై మమకారంతో మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు రూ.5వేల విలువ గల ఆల్ఇన్‌వన్ బుక్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణను ఎంఈఓ తండు వెంకటనారాయణ అభినందించారు.